భారత ఆర్థిక వ్యవస్థ - ప్రధాన రంగాలు

ఒక దేశ ఆర్థికవ్యవస్థ అభివృద్ధి ఆ దేశంలో వివిధ రంగాల నుంచి తయారయ్యే ఉత్పత్తుల విలువపై ఆధారపడి ఉంటుంది. వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాల్లో వచ్చే నిర్మాణాత్మక మార్పులను ఆ దేశ ఉత్పత్తుల్లో (స్థూల దేశీయోత్పత్తులు లేదా జీడీపీ) గమనించవచ్చు. ఉత్పత్తులు ప్రసాదించే రంగాలు ప్రధానంగా మూడు.

ప్రాథమిక రంగం

ప్రకృతి ప్రభావం అధికంగా ఉండే ఉత్పత్తి కార్యకలాపాలు ఈ రంగానికి సంబంధించినవి. వీటిలో ముఖ్యమైనవి వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు. గనులు, తవ్వకాలను ప్రాథమిక రంగంలో లెక్కిస్తారు. అడవులు, పశుసంపద, కోళ్లు, చేపలు, పందులు, పాడి పరిశ్రమలు వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందినవి. ప్రాథమిక రంగంలో వ్యవసాయ రంగం వాటా వేగంగా క్షీణిస్తూ ఉండగా, చేపలు, అడవుల ఉత్పత్తుల్లో వృద్ధి నిలకడగా ఉంది. గనుల తవ్వకాల ఉత్పత్తుల్లో కూడా వృద్ధి కనపడుతోంది. (సి.ఎస్.ఓ. గణాంకాలు)

ద్వితీయరంగం

దీనిలో ప్రధానమైనవి పరిశ్రమలు, నిర్మాణం, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా. ఈ రంగం ఉత్పత్తుల్లో పరిశ్రమలు, నిర్మాణాల శాతం ఎక్కువ.

తృతీయ లేదా సేవల రంగం

మొదటి రెండు రంగాలు భౌతిక వస్తువులను, తృతీయ రంగం అభౌతిక అంటే సేవలను ఉత్పత్తి చేస్తుంది. ఈ రంగంలో ఆరు ఉపభాగాలున్నాయి. వర్తక వాణిజ్యం, రవాణా, సమాచారం, హోటళ్లు, రెస్టారెంట్లు, రియల్ ఎస్టేట్స్, బ్యాంకింగ్, భీమా సర్వీసులు, రక్షణ, ప్రభుత్వ పరిపాలన, వృత్తిపరమైన సేవలు మొదలైనవి.

వృద్ధి పంథాలో మొదట ప్రాథమిక రంగం వాటా తగ్గి పరిశ్రమల వాటా పెరుగుతుంది. తర్వాత అభివృద్ధి దశలో తిరిగి ప్రాథమిక వాటా తగ్గి, ద్వితీయ, తృతీయ రంగాల వాటాలు పెరుగుతాయి. ద్వితీయరంగం కంటే తృతీయ రంగం శీఘ్రంగా వృద్ధిచెంది అగ్రస్థానానికి చేరుకొంటుంది. ఈ మార్పులు రంగాల వారీ జాతీయోత్పత్తి, మొత్తం ఉద్యోగితలో అంటే రెండింటిలో ఏర్పడతాయి. దీని ఆధారంగా భారత ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకొన్న మార్పులను పట్టిక 1లో చూడొచ్చు. అయిదన్నర దశాబ్దాల కాలంలో జీడీపీలో ప్రాథమిక రంగం వాటా 50లో 56.5 శాతం నుంచి 1998-99 నాటికి 26.2, మరింత గణనీయంగా 2006-07 నాటికి 18.5 శాతానికి పడిపోయింది. అదే సమయంలో ద్వితీయ, తృతీయ రంగాల వాటాలు పెరిగాయి. 1980-81 వరకు, ఉత్పత్తి ఆదాయాలకు వ్యవసాయ రంగం ప్రధాన ఆధారం. ఆ తర్వాత కాలంలో సేవల రంగం మొత్తం జాతీయ ఉత్పత్తిలో 55.1 శాతంతో ఆదాయాల వృద్ధికి తోడ్పడుతోంది. ప్రపంచంలో సర్వీసుల ఉత్పత్తుల్లో భారత్‌ది 15వ స్థానం, ఉద్యోగితలో 23 శాతం ఈ రంగం ద్వారానే సమకూర్చబడుతుంది.

పట్టిక 2ను పరిశీలిస్తే 10వ ప్రణాళిక జీడీపీలో అత్యధిక వృద్ధిరేటు సాధించిన రంగాలు రవాణా, కమ్యూనికేషన్స్ (15.3 శాతం), నిర్మాణం (12.9 శాతం), ఉత్పత్తి రంగం 8.6 శాతం. దేశ ఆర్థిక వృద్ధికి ఈ రంగాల ప్రగతి ఎంతో దోహదం చేస్తోంది. 10వ ప్రణాళికలో వ్యవసాయరంగ వృద్ధిరేటు జీడీపీలో అన్ని రంగాల కంటే అత్యల్పంగా ఉంది.

జీడీపీ.. ఇటీవల పరిణామాలు

2006-07లో 9 శాతం, 2007-08లో 7.4%, 2008-09లో 6.7% (ఆశించింది 8.7%), జీడీపీలో వృద్ధిరేటు సాధిస్తే, 2009-10లో ఆర్థిక మాంద్య సంవత్సరంలో కనీసం 7.2 శాతం సాధించాలని లక్ష్యంగా పెట్టుకొన్నారు.

భారత్ 5.5 శాతం వృద్ధిరేటును సాధించగలదని బర్కెలే క్యాపిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్... అంచనా. ఇటీవల భారత్‌లో తిరిగి పెరిగిన కొనుగోలు శక్తి వల్ల 7.2 శాతం వృద్ధి సాధ్యమేనని చెప్పింది. ప్రస్తుత ప్రపంచ దేశాల సగటు జీడీపీ వృద్ధిరేటు 5.5 శాతం ఉండగా, ఆర్థిక మాంద్య పరిస్థితుల్లో కూడా అంతకంటే ఎక్కువ వృద్ధిరేటును భారత్ సాధించడం గమనార్హం. ఇదే తరహాలో భారత జీడీపీ వృద్ధి చెందితే 2050 నాటికి చైనా తర్వాత (రెండో స్థానం) అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మన దేశం అవతరించగలదని విశ్లేషకుల అంచనా.

జీడీపీ, బడ్జెట్ మేనేజ్‌మెంట్

కేంద్ర ప్రభుత్వం జూలై 5, 2004న అమల్లోకి తెచ్చిన విత్త బాధ్యత, ద్రవ్య నిర్వహణ (FRBM Act) చట్టం ప్రకారం మార్చి 2009 నాటికి లోటు లేకుండా రెవెన్యూ సర్ప్లస్ (Revenue Surplus) సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2001 నుంచి లెక్కించుకొని ప్రతీ ఆర్థిక సంవత్సరాంతానికి జీడీపీ 0.5 శాతం లేదా అంతకంటే ఎక్కువ శాతానికి సమానమైన మొత్తాన్ని రెవెన్యూ లోటులో తగ్గించుకుంటూ

పట్టిక : 1
భారత ఆర్థిక వ్యవస్థలో రంగాలవారీ జీడీపీ సాపేక్ష వాటాలు

సంవత్సరం	ప్రాథమిక రంగం	ద్వితీయ రంగం	తృతీయ రంగం	మొత్తం
1950 - 51 (1980 - 81 ధరల్లో)	56.5	15.0	28.5	100% (రూ. 49,000 కోట్లు)
1997 - 98 (1980 - 81 ధరల్లో)	26.2	29.5	44.3	100% (రూ. 3,12,000)
2006 - 07 (1999 - 00 ధరల్లో)	18.5	26.4	55.1	100% (రూ. 25,30,495)

పట్టిక 2

ఇటీవల రంగాల వారీగా జీడీపీలో వృద్ధిరేటు (1999 – 2000 ధరలలో) (%)

రంగం	9వ ప్రణాళిక	10వ ప్రణాళిక
ప్రాథమిక రంగం		
వ్యవసాయం, అనుబంధ రంగాలు	2.5	2.5
మైనింగ్	4.0	6.1
ద్వితీయ రంగం		
ఉత్పత్తి రంగం	3.3	8.6
విద్యుత్	4.8	5.6
నిర్మాణం	7.1	12.9
తృతీయ (సేవల) రంగం		
వాణిజ్యం, హోటళ్లు	7.5	8.5
రవాణా, కమ్యూనికేషన్లు	8.9	15.3
రియల్ ఎస్టేట్, హౌసింగ్	8.0	9.5
కమ్యూనిటీ సర్వీసులు	7.7	6.1
జీడీపీ సగటు వృద్ధి	5.5	7.8

మూలం: కేంద్ర గణాంకాల సంస్థ (CSO)

కొనసాగాలని నిర్ణయించారు.

అదే విధంగా ఫిస్కల్ లోటును జీడీపీలో 2 శాతం విలువకు సమానంగా అయిదేళ్ల కాలంలో మార్చి 2006 నాటికి తగ్గించాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల వద్ద నుంచి సేకరించిన రుణాల (Public Debt) విలువ ఏప్రిల్ 2001 నుంచి మార్చి 2011ల మధ్య జీడీపీ విలువలో 50 శాతానికి మించకుండా ప్రభుత్వం విత్త బాధ్యతను నెరవేర్చుకోవాలని FRBM చట్టం నిర్దేశిస్తుంది.

2009లో కనీసం 7 శాతం జీడీపీలో వృద్ధి సాధించి, తర్వాత మూడేళ్లలో 9 శాతం వృద్ధిరేటును సాధించగలమని ప్రధాని మన్మోహన్‌సింగ్ ఇటీవల లోక్‌సభలో ధీమా వ్యక్తం చేశారు. మన దేశంలో ఉద్యోగిత(Employment)లో ఒక శాతం అభివృద్ధి సాధించడానికి జీడీపీలో పెరుగుదల రేటు కనీసం 10 శాతం ఉండాలని ఆర్థికవేత్తలంటున్నారు.

మాదిరి ప్రశ్నలు

1. ప్రాథమిక రంగానికి సంబంధించి ఏది సరైంది కాదు?

ఎ) వ్యవసాయరంగం వాటా జాతీయాదాయంలో పెరుగుతుంది

బి) వ్యవసాయ రంగం వాటా జీడీపీలో 42 శాతం

సి) వ్యవసాయరంగం అంటే అడవులు, గనులు, చేపలు

డి) ఏదీ కాదు

2. నీటి సరఫరా ఏ రంగంలోనిది?

ఎ) ప్రాథమిక బి) ద్వితీయ

సి) సేవల డి) ఎ, బి

3. 1951 నాటికి జీడీపీలో వ్యవసాయ రంగం వాటా ఎంత శాతం?

ఎ) 56.5 బి) 76.2 సి) 60 డి) 33

4. ఇటీవల వ్యవసాయరంగం వాటా జీడీపీలో ఎంత స్థాయికి తగ్గింది?

ఎ) 22 బి) 18.5 సి) 16.3 డి) 25

5. జీడీపీలో ప్రాథమిక రంగం వాటా తగ్గడానికి లేదా సేవల రంగం, పరిశ్రమల రంగం వాటాలు పెరగడానికి ప్రధాన కారణం?

ఎ) ప్రాథమిక రంగం పట్ల ప్రభుత్వ అనాసక్తి

బి) ఆర్థిక వ్యవస్థలో వచ్చిన నిర్మాణాత్మక మార్పులు

సి) పరిశ్రమల రంగంలో ప్రగతి

డి) బి, సి

6. ఆర్థికంగా ముందు వరుసలో ఉన్న దేశాల్లో ఏ రంగం ఎక్కువ అభివృద్ధి చెంది ఉంటుంది?

ఎ) ప్రాథమిక బి) ద్వితీయ

సి) సేవల డి) ఎ, బి

7. 10వ ప్రణాళికలో జీడీపీలో అత్యధిక వృద్ధిరేటు సాధించిన రంగాలు?

ఎ) రవాణా, కమ్యూనికేషన్స్ బి) ఉత్పత్తి

సి) నిర్మాణ డి) బి, సి

8. 10వ ప్రణాళికలో జీడీపీలో అన్ని రంగాల కంటే అత్యల్ప వృద్ధిరేటు నమోదైన రంగం?

ఎ) పరిశ్రమల బి) వ్యవసాయ

సి) నిర్మాణ డి) సేవల

సమాధానాలు

1 బి	2 బి	3 ఎ	4 బి	5 డి
6 బి	7 ఎ	8 బి		